నమస్తే తెలంగాణ
కామారెడ్డి
3 | నిజామాబాద్, శుక్రవారం 29 నవంబర్ 2024 | KAMAREDDY

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఇదేనా ఇందిరమ్మ రాజ్యం?

- అక్రమ అరెస్టులు, నిర్బంధాలు
- ఇది ప్రజాపాలన కాదు.. రాక్షస పాలన
- ఎక్కడ చూసినా కాంగ్రెస్ కాండ కావరమే
- రేవంత్ రెడ్డి పాదం తెలంగాణకు ప్రమాదం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి నవంబర్ 28 : తెలంగాణలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ కండకావరమే కనిపిస్తున్నది. అక్రమ అరెస్టులు, లాఠీచార్జీలు, నిర్బంధాలు, కూల్చివేతలు, పేల్చివేతలు. ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా? అని బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఇది ప్రజా పాలన కాదు, రాక్షస పాలన అని మండిపడ్డారు. నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ భూములు పాడిపంటలతో విలసిల్లితే, రేవంత్‌రెడ్డి వచ్చాక అగ్నిమంటలతో కాలిపోతూ కనిపిస్తున్నాయన్నారు. రేవంత్‌రెడ్డి ఏ ముహూర్తంలో వచ్చాడో కానీ, ఆయన పాదం తెలంగాణకు ప్రమాదకరంగా మారిందన్నారు. సీఎం సోదరులది అంతులేని అవినీతి, చిట్టినాయుడు దుర్నీతికి తెలంగాణ ఆహుతి అవుతున్నదని తెలిపారు. రేవంత్ సోదరులు భూకబ్జాకోరులు. వారికి అధికారులు వంత పడుతున్నారని మండిపడ్డారు. పల్లెల్లో అధికారుల దురహంకారం పెరుగుతుండంతో రైతులు, ప్రజలు తిరగబడుతున్నారన్నారు. మొన్న లగచర్ల, నిన్న దిలావర్‌పూర్.. ఏ గ్రామంలో అయినా కాంగ్రెస్ సర్కారుపై ప్రజల సంగ్రామమే కనిపిస్తున్నదన్నారు.

వడ్డీతో సహా చెల్లిస్తాం..

అప్పట్లో నీరో చక్రవర్తి రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేల్ వాయించినట్లు, ఇప్పుడు సీఎం రేవంత్ ఢిల్లీలో ఫిడేల్ వాయిస్తూ తెలంగాణను తగలబెడుతుండని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన పేరుతో రూ.లక్షన్నర కోట్ల అవినీతికి సిద్ధపడుతున్నాడని జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఇదేమని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేయిస్తున్నారని తెలిపారు. తనతో పాటు నిజామాబాద్ నగరమేయర్ భర్తపై అక్రమంగా కేసులు పెడుతున్నారని, 11 నెలల్లో 1200లకు పైగా కేసులు పెట్టారని తెలిపారు. తాము అధికారంలో ఉన్న పదేండ్లలో ఇన్ని కేసులు పెడితే కాంగ్రెస్ బతికి బట్టకట్టేదా? అని ప్రశ్నించారు. అధికారులు అతి చేస్తున్నారని, వారి పేర్లు పింక్ బుక్‌లో ఎక్కిస్తున్నామని చెప్పారు. వచ్చేది తమ ప్రభుత్వమేనని, తప్పు చేసిన వారు ఎక్కడున్నా పట్టుకుని వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. దీక్షా దివస్ స్ఫూర్తితో రేవంత్ సర్కారుపై సమరభేరి మోగిస్తామని చెప్పారు. శుక్రవారం నిర్వహించనున్న దీక్షాదివస్‌కు పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, బీఆర్ఎస్ పార్టీ బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆయేషా ఫాతిమా, నేతలు రాంకిషన్‌రావు, సుజీత్‌సింగ్ ఠాకూర్, ప్రభాకర్, సత్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్లను మోసగించిన రేవంత్..

సీఎంగా పాలనలో విఫలమైన రేవంత్.. అరాచకాల్లో సఫలమవుతున్నారని ఎద్దేవా చేశారు. హోంశాఖను దగ్గర పెట్టుకుని శాంతిభద్రతలను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. గురుకులాల్లో మరణ మృదంగం మోగుతున్నదని, 11 నెలల్లో 48 మంది విద్యార్థులు మృత్యువాతపడితే పట్టించుకోలేదని తెలిపారు. శైలజ అనే విద్యార్థి చనిపోతే ఆ గ్రామానికి ఎవరూ వెళ్లకుండా నిర్బంధం చేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్కరైనా సంతోషంగా ఉన్నారా? అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఆటోడ్రైవర్ నుంచి అంగన్‌వాడీల వరకూ, ఉద్యోగుల నుంచి నిరుద్యోగుల వరకూ ఎవరూ సంతోషంగా లేరని తెలిపారు. పోలీసులు, లాయర్లు సైతం రోడ్లపైకి వస్తున్నారన్నారు. బాసర నుంచి మొదలు కీసర దాకా అందరు దేవుళ్లకు శరగోపం పెట్టిన ఘనుడు రేవంత్‌రెడ్డి అని విమర్శించారు.

అంతులేని అవినీతి..

నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ అవినీతికి అంతే లేకుండా పోయిందని, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ బంధుగణం అవినీతికి జిల్లా బలవుతున్నదని తెలిపారు. ఆ పార్టీ నాయకులు ఈరవత్రి అనిల్ ఇసుక దందాలో, సుదర్శన్‌రెడ్డి అనేక జిల్లాల్లో లిక్కర్ వ్యాపారంలో మునిగి తేలుతున్నారన్నారు. ఆర్మూర్‌లో కాంగ్రెస్ నాయకుడు వినయ్‌రెడ్డి అవినీతికి పాల్పడుతూ ప్రజలను దోచుకుంటున్నారని తెలిపారు.

నేటి దీక్షా దివస్‌కు పెద్ద సంఖ్యలో తరలిరావాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి పిలుపు

నిజామాబాద్ జిల్లాలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నామని, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు వినాయక్‌నగర్‌లోని అమరవీరుల స్తూపానికి నివాళి, 10.30 గంటలకు పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం, అనంతరం అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు నివాళి, రక్తదాన శిబిరం, ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి నియోజకవర్గం నుంచి ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.



అటకెక్కిన పెన్షన్ల పెంపు

రేవంత్ సర్కారు రైతులను మోసగించినట్లే మహిళలు, వృద్ధులు, దివ్యాంగులను మోసం చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందర తెగ హడావుడి చేసిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వస్తే పెన్షన్లను రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చింది. 'ఈ నెల మీకు వచ్చేది రూ.2 వేల పెన్షనే. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వచ్చే నెల నుంచి రూ.4 వేల పెన్షన్ వస్తది' అని రేవంత్ సహా కాంగ్రెస్ నేతలంతా గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. గద్దెనెక్కి ఏడాది కావస్తున్నా సీఎం సహా ఎవరూ పింఛన్ల పెంపుపై నోరెత్తడం లేదు. పెన్షన్ పెంచుడు తర్వాత సంగతి.. గతంలో కేసీఆర్ ఇచ్చినట్లు ఠంచన్‌గా నెలారంభంలోనే డబ్బులు ఇస్తే చాలని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.

నిజామాబాద్ జిల్లాలో పింఛన్ల లెక్క..

వృద్ధులు	68,677
వితంతువులు	74,154
దివ్యాంగులు	18,849
చేనేత కార్మికులు	184
గీత కార్మికులు	1,024
బీడీ కార్మికులు	95,453
బీడీ టేకేదారులు	10,185
ఒంటరి మహిళలు	1,020
బోధకాలు	1,841
కిడ్నీ బాధితులు	181
అస్తమా వ్యాధిగ్రస్తులు	381

పింఛన్ రాలే..

- నిధులు విడుదల చేయని సర్కారు
- నెల ముగుస్తున్నా ఇంకా మొదలుకాని పంపిణీ
- పింఛన్లు రెట్టింపు చేస్తామన్న కాంగ్రెస్
- ఇచ్చేదన్నా సక్కగా ఇవ్వక సతాయిస్తున్నవైనం
- కేసీఆర్ ఇచ్చినట్లు నెలారంభంలోనే ఇవ్వడంలో విఫలం
- బిగాలుగా చూస్తున్న లబ్ధిదారులు

డిచ్‌పల్లి, నవంబర్ 28 : సామాజిక పెన్షన్లు రాక లబ్ధిదారులు సతమతమవుతున్నారు. నెలాఖరు వచ్చినా పంపిణీ ప్రారంభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పింఛన్ల పంపిణీ మొదలు కాలేదు. మందులు, ఇంటి ఖర్చుల కోసం పెన్షన్లపైనే ఆధారపడి బతుకుతున్న ఎంతోమంది ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, గీత, నేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలాంటి ఆదాయం లేక, కేవలం పింఛన్‌పైనే ఆధారపడి కాలం వెళ్లదీస్తున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది. పింఛన్లు రెట్టింపు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా పెంపు లేదు సరికదా.. సమయానికి పెన్షన్లు కూడా ఇవ్వడం లేదు. దీనిపై లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పింఛన్ల పెంపు దేవుడెరుగు.. కేసీఆర్ సారు ఇచ్చినట్లు టైముకు మాకు పింఛన్లు ఇస్తే అదే పదివేలు అని చెబుతున్నారు.

గతంలో ఠంచన్‌గా..

తెలంగాణ ఏర్పాటయ్యాక కేసీఆర్ అధికారం చేపట్టాక సామాజిక పింఛన్లను భారీగా పెంచారు. వృద్ధులు, వితంతువులకు గతంలో ఇస్తున్న రూ.200 పెన్షన్‌ను రెండు దఫాల్లో పెంచి రూ.2016 వేలు చేశారు. దివ్యాంగులకు రూ.4016 చొప్పున ఇచ్చి ఆసరాగా నిలబడ్డారు. అంతేకాకుండా బీడీలపై ఆధారపడి బతుకుతున్న లక్షలాది మహిళలకు సైతం రూ.2 వేల చొప్పున జీవనభృతి ఇచ్చారు. అలాగే, గీత, నేత కార్మికులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడే వారికి సైతం 'ఆసరా'గా నిలిచారు. కేసీఆర్ పాలనలో ప్రతి నెలా మొదటి వారంలోనే ఠంచన్‌గా పింఛన్లు వచ్చేవి. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయింది. ఒక నెల పెన్షన్‌ను ఎగ్గొట్టిన రేవంత్ సర్కారు.. నెల ఆరంభంలోనే ఇవ్వాల్సిన పింఛన్లను నెలాఖరు వచ్చినా ఇవ్వకుండా సతాయిస్తున్నది.

పెన్షనే ఆధారం..

నిజామాబాద్ జిల్లాలో 2.71 లక్షలు, కామారెడ్డి జిల్లాలో 1.53 లక్షల మందికి పైగా వివిధ రకాల సామాజిక పెన్షన్లు పొందుతున్నారు. దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు పెన్షన్లను నమ్ముకుని బతుకున్నారు. ప్రతినెలా ప్రభుత్వం అందించే పింఛన్లతోనే రోజులు వెళ్లదీస్తున్నారు. అయితే, నవంబర్ నెల గడిచిపోతున్నప్పటికీ రేవంత్ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. దీంతో పింఛన్ల పంపిణీ ప్రారంభం కాలేదు. కనీసం ఆసరా పెన్షన్లకు కూడా ప్రభుత్వం డబ్బులు ఇవ్వలేక పోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

ఊరూరా దీక్షా దివస్ స్ఫూర్తి..

ఉద్యమనేత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్ఫూర్తితో ఈసారి అన్ని జిల్లాకేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు గులాబీ పార్టీ సిద్ధమైంది. ఈ కార్యక్రమాల నిర్వహణకు 33 జిల్లాలకు సీనియర్ నాయకులను ఇన్‌చార్జీలుగా నియమించారు. కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఈ నెల 26న సన్నాహక సమావేశాలను నిర్వహించారు. ఆనాటి ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో మళ్లీ రగిలించేలా దీక్షా దివస్‌ను చేపడుతామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. నిజామాబాద్ జిల్లాకు దీక్షా దివస్ ఇన్‌చార్జీగా మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, కామారెడ్డి జిల్లాకు ఐపీఎస్ మాజీ అధికారి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను నియమించింది. వీరి నేతృత్వంలో ఇప్పటికే సన్నాహకసమావేశాలు జరిగాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతోపాటు ప్రతి నియోజకవర్గం నుంచి వందలాది మంది దీక్షా దివస్ కార్యక్రమాలకు తరలిరానున్నారు. కేసీఆర్ దీక్షా ఫలితంగా డిసెంబర్ 9న వచ్చిన తెలంగాణను వెనక్కి తీసుకున్న నాటి కాంగ్రెస్ ప్రభుత్వ దమననీతిని వక్తలు ఎండగట్టనున్నారు.



కేసీఆర్ దీక్షకు నేటితో 15 ఏండ్లు

నవంబర్ 29న ఆమరణ దీక్షకు దిగిన వైనం

ప్రాణాలకు తెగించి లక్ష్యాన్ని ముద్దాడిన ఉద్యమ నేత

'దీక్షా దివస్' పేరిట బీఆర్ఎస్ కార్యక్రమాలు

ఉద్యమ స్ఫూర్తి రగిలించేలా సన్నాహాలు

తదేక దీక్షతో..

తెలంగాణను సాధించిన కేసీఆర్

నిజామాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పి, ఉద్యమ చరిత్రపై చెరిగిపోని సంతకం చేసిన మహా నాయకుడు కేసీఆర్. ఉద్యమ నాయకుడిగా ఆయన తెలంగాణ తెచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.. నినాదంతో ఆమరణ దీక్షకు దిగిన రోజు 2009 నవంబర్ 29. నేటితో కేసీఆర్ ఆమరణ దీక్షకు 15 ఏండ్లు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రజ్వలింపజేసి, తెలంగాణ రాష్ట్ర సాధనకు అంకురార్పణ చేసిన ఆ రోజును బీఆర్ఎస్ దీక్షా దివస్‌గా పాటిస్తున్నది. 2009 నవంబర్ 29న కరీంగనర్‌లోని కేసీఆర్ భవన్ నుంచి దీక్షాస్థలి సిద్దిపేటకు కేసీఆర్ బయల్దేరగా.. కరీంనగర్ మానేరు బ్రిడ్జి వద్ద పోలీసులు కేసీఆర్‌ను అరెస్టు చేశారు. అక్కడి నుంచి ఖమ్మం జైలుకు తరలించారు. ఆ తర్వాత నిమ్స్ దవాఖానాకు తీసుకెళ్లారు. అక్కడే కేసీఆర్ తన ఆమరణ దీక్షను 11 రోజులపాటు కొనసాగించారు. ఆరోగ్యం క్షీణించినా, ప్రాణం పోయినా సరే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తీరుతానని స్పష్టంచేశారు. కేంద్రం తెలంగాణను ఇవ్వకతప్పని అనివార్యతను సృష్టించారు. డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని యూపీఏ ప్రభుత్వం ప్రకటించిన తర్వాతే ఆయన దీక్షను విరమించారు. తర్వాత అనేక అడ్డంకులను అధిగమించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారు. కేసీఆర్ దీక్షకు దిగిన ఆ రోజు చరిత్రలో అజరామరంగా నిలిచిపోగా.. బీఆర్ఎస్ ఏటా నవంబర్ 29న దీక్షా దివస్‌ను నిర్వహిస్తున్నది. భారత రాష్ట్ర సమితి పిలుపు మేరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో నేడు దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించనున్నారు.

డ్రైనేజీలో పడి చిన్నారి మృతి

- ఆర్మూర్‌లో విషాదం

ధనస్వి

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 28 : అప్పటివరకు సంతోషంగా ఆడుకున్న చిన్నారి.. కాలువలో పడి కొన్ని క్షణాల వ్యవధిలోనే ప్రాణం కోల్పోయింది. ఉన్న ఒక్కగానొక్క కూతురు మృతిచెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొన్నది. కుటుంబీకులు, స్థానికులు, తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ పట్టణంలోని రాంనగర్‌లో ఉండే మట్ట జ్యోతిక – ప్రసాద్ దంపతుల కుమార్తె మట్ట ధనస్వి (4) గురువారం ఉదయం ఆడుకుంటూ ఇంటి ఎదుట ఉన్న డ్రైనేజీలో పడింది. అప్పటివరకు ఇంటి వద్ద ఆడుకున్న చిన్నారి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో అనుమానం వచ్చి ఇంటి ఎదుట ఉన్న డ్రైనేజీలో చూడగా.. నీటి బుడగలు రావడంతో అందులో పడినట్లు గుర్తించి, స్థానికుల సహాయంతో గాలించారు. చిన్నారిని బయటికి తీసి దవాఖానకు తరలించినప్పటికీ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదాలు జరగకుండా డ్రైనేజీ వద్ద ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రాణం పోయినా తగ్గేదేలే..

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

- అవినీతిపరుడైన ఎమ్మెల్యేపై నిరంతర పోరాటం
- సోషల్‌మీడియాలో నాపై తప్పుడు ప్రచారం
- జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే

బిచ్కుంద, నవంబర్ 28: అవినీతిపరుడైన జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుపై నిరంతర పోరాటం కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే స్పష్టంచేశారు. ఎక్కడా రాజీ పడేదే లేదని తేల్చిచెప్పారు. బిచ్కుందలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లక్ష్మీకాంతారావు ఎస్సీ కాదు, బీసీ అని తాను కోర్టులో పిటిషన్ వేశానని చెప్పారు. అయితే, కేసు విషయంలో తాను ఎమ్మెల్యేతో కాంప్రమైజ్ అయ్యానని ఒక పత్రికలో, సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఎక్కడా తగ్గేది లేదని, గొంతులో ప్రాణం ఉన్నంత వరకూ అవినీతిపరుడైన లక్ష్మీకాంతారావుతో కొట్లాడుతూనే ఉంటానని స్పష్టం చేశారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివిన రికార్డుల్లో లక్ష్మీకాంతారావు బీసీ అని ఉందని, దీనిపైనే తాను పిటిషన్ వేశానని తెలిపారు. అధికారులను మభ్యపెట్టి ఎస్సీ సర్టిఫికెట్ పొందాడని, తమకు న్యాయస్థానం, రాజ్యాంగం మీద గౌరవం ఉన్నదని, ఎమ్మెల్యే వ్యవహారాన్ని న్యాయస్థానమే తేల్చుతుందన్నారు. తాను 15 ఏండ్లు ఎమ్మెల్యేగా ఉన్నా ఎప్పుడూ అవినీతికి పాల్పడలేదన్నారు. కానీ ఎమ్మెల్యే అయి ఏడాది కూడా పూర్తి కాకముందే లక్ష్మీకాంతారావుపై సొంత పార్టీ కార్యకర్తలే తిరగబడుతున్నారని తెలిపారు. డబ్బులు తీసుకుని మార్కెట్ కమిటీ పదవులు ఇస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు గాంధీ భవన్‌లో ధర్నా చేసిన విషయాన్ని ఈ సందర్భంగా షిండే గుర్తు చేశారు. లక్ష్మీకాంతారావు ఎమ్మెల్యే కావడం ఈ ప్రాంతానికి ఎంత నష్టమో ప్రజలతో పాటు సొంత పార్టీ నేతలకు తెలిసి వచ్చిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరావు దేశాయ్, నేతలు బాలాజీ, హన్మాండ్లు, సంజు పటేల్ పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐపీకేఎంఎస్ నాయకులు

వ్యవసాయ కార్మికులను విస్మరిస్తే బుద్ధి చెప్తాం

మోర్తాడ్‌లో ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ, తహసీల్ కార్యాలయం ముట్టడి

మోర్తాడ్, నవంబర్ 28 : వ్యవసాయ కార్మికులను విస్మరిస్తే రాష్ట్రప్రభుత్వానికి బుద్ధి చెప్తామని, వారికి ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల డిమండ్లు, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మోర్తాడ్‌లో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ సుజాతకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. ఏడాదంతా పనిలేక వ్యవసాయ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి రూ.12 వేల జీవనభృతి ఇవ్వాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్మికసంఘం నాయకులు కిషన్, సారా సురేశ్, సత్తెమ్మ, అశోక్, దామోదర్, దయాశ్‌సింగ్, పోశెట్టి, నాని, అంజలి, శ్రీనివాస్, పద్మ తదితరులు పాల్గొన్నారు.